ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | 5





ఏదో.. ఫీలింగ్!



నేడు ప్రేమికుల దినోత్సవం 6

అనంతమైన ఆనందం.. అంతకుమించిన మాధుర్యం.. జీవితమంత అమృతం.. గుప్పెడంత గుండెలో ప్రమాణం.. కంటికి కనిపించని భావన.. అదొక అంతులేని కావ్యం.. రాయలేనన్ని అనుభవాల ప్రవాహం.. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఆ రెండు అక్షరాల్లో ఇముడ్చుకొని విశ్వాన్ని ఏలుతోంది. అదే.. ప్రేమ. రెండు మనసులను ఒక్క క్షణంలో కలిపి ఏడడుగులు వేయించి జీవితమంతా ఒకరికొకరు తోడూనీడగా నడిపించే మహత్తర శక్తి ఈ ప్రేమ. దాని గురించి నిర్వచనం చెప్పాలంటే అనిర్వచనీయమే. ఏదో తెలియని ఫీలింగ్.. ఫీలింగ్. ప్రేమకోసం అందరూ పరితపిస్తారు. దానికోసం ప్రాణానికికన్నా మిన్నగా పోరాడతారు. కానీ కొందరే ప్రేమను జయిస్తారు. నిజానికి ప్రేమ కథలంటే అందరికీ ఇష్టమే. ఈ ప్రేమికుల దినోత్సవాన కొన్ని ప్రేమ కథలను మీరూ చదివేయండి మరి!



వైభవంగా నరసన్న తెప్పోత్సవం, పుష్పోత్సవం







గురువారం రాత్రి జరిగిన స్వామి వారి పుష్పోత్సవం.. (పైన) తెప్పోత్సవ దృశ్యం

ముగిసిన అంతర్వేది కల్యాణ ఉత్సవాలు 6

ఇంకా 'సిట్' అవదా..



- కాకినాడలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అతీగతీలేని సిట్
- ప్రత్యేక సిట్ బృందాన్ని నియమించి రెండు నెలలు దాటినా విచారణ ఏదీ
- దర్యాప్తు అసలు ఎప్పుడు మొదలవుతుందో కూడా తెలియని పరిస్థితి
- గతేడాది నవంబరు నెలాఖరులో స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం
- అప్పట్లో కొద్దిరోజులపాటు రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అట్టుడికిన కాకినాడ
- డిసెంబర్ 6న సిట్ నియమించిన తర్వాత నుంచీ నెమ్మదించిన చర్యలు
- మరోపక్క సిట్ దర్యాప్తు మొదలవకపోవడంతో రేషన్ మాఫియాలో దర్జా
- తమకేం కాదనే ధోరణిలో మళ్లీ మొదలైన రేషన్ బియ్యం కొనుగోళ్లు

కాకినాడ కేంద్రంగా కొనసాగిన వందల కోట్ల రేషన్ బియ్యం మాఫియాపై సిట్ దర్యాప్తునకు అతీగతీ లేకుండాపోతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి నెలలకు నెలలు గడుస్తున్నా అసలు విచారణ ఊసే లేదు. ఈనేపథ్యంలో అసలు రేషన్ మాఫియాపై సిట్ రంగంలోకి దిగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ నుంచి రూ.8 వేల కోట్లకుపైగా విలువైన బియ్యం నౌకల్లో విదేశాలకు ఎగుమతైంది. ఇందులో సగాని కిపైగా రేషన్ బియ్యమే. అయితే స్టెల్లా నౌకలో గతేడాది నవంబరులో రేషన్ బియ్యం పట్టుబడ్డ నేపథ్యంలో వేళ్లూనుకుపోయిన మాఫియా బట్టబయలైంది. దీంతో రేషన్ స్మగ్లింగ్ గుట్టు తేల్చ డానికి ప్రభుత్వం డిసెంబరు 6న సిట్‌ను నియమించింది. ఇది జరిగి రెండు నెలలకుపైగానే దాటిపోయినా సిట్ విచారణకు అసలు దిక్కులేకుండా పోయింది. అప్పట్లో నౌకలో రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి డిప్యూటీ సీఎం పవన్ రావడం, షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. తీరా విచారణ ఊసే లేకపోవడంతో అక్రమార్కులు మళ్లీ చెలరేగిపోతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని వైసీపీ అక్రమార్కులు చెరబట్టేసి గడచిన అయిదేళ్లలో భారీగా విదేశాలకు తరలించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రహస్య నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి రేషన్ బియ్యం పేదలకు ఇలా అందగానే.. అలా కిలోకు రూ.10 చెల్లించి లక్షల టన్నులు కాకినాడకు తరలించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రధానంగా వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. పౌరసరఫరాలశాఖ పరిధిలోని రేషన్ బియ్యం వ్యవస్థను కుళ్లబొడిచేశారు. ప్రభుత్వం వందలకోట్లు సబ్సిడీ చెల్లించి పేదలకు ఇచ్చే బియ్యాన్ని సదరు నేత, ఆయన మనుషులు కారుచౌకగా కొట్టేసి దాన్ని సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్‌చేసి ఆకర్షణీయ ప్యాకింగ్‌ల్లో ఉంచి నౌకల ద్వారా ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేలకోట్లు గడించారు. ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19 లక్షల మెట్రిక్ టన్నులు, 2020-21లో 27 లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 29లక్షల మెట్రిక్ టన్నులు, 2022-23లో 38లక్షల మెట్రిక్ టన్నులు, 2023-24లో 24లక్షల మెట్రిక్ టన్నులు తరలిపోయింది. ఇందులో రేషన్ బియ్యం సగానికిపైనే. అయితే గతేడాది నవంబరు ఆఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికాదేశానికి స్టెల్లానౌకలో రహస్యంగా ఎగుమతికి సిద్ధంచేసిన రేషన్ బియ్యం పట్టుబడడంతో స్మగ్లింగ్ వ్యవహారం అధికారికంగా బయటకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడకు వచ్చి స్వయంగా షిప్ వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రేషన్ ఆనవాళ్ల కోసం వెదికితే కాకినాడ, చుట్టుపక్క ప్రాంతాల్లో అనేక గోదాముల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది. ఈనేపథ్యంలో వేళ్లూనుకుపోయిన రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై రాష్ట్రప్రభుత్వం గతేడాది డిసెంబరులో ఉక్కుపాదం మోపింది. మాఫియాను అంతమొందించి అక్రమార్కులను శిక్షించే విధంగా ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. రేషన్ బియ్యం కాకినాడకు నలుమూలల నుంచి ఎలా చేరుకుంటోంది? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? అక్కడి నుంచి ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోనున్నాయనేదానిపై ఈ సిట్ బృందం దర్యాప్తు చేపడుతుందని పేర్కొంది. ఈ క్రమంలో దర్యాప్తులో భాగంగా నిందితులను తక్షణం అరెస్టు చేసే అధికారం సైతం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే కాకినాడ, చుట్టుపక్కల మొత్తం అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపై కూలంకుషంగా దర్యాప్తుచేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే సిట్ బృందాన్ని నియమించిన నేపథ్యంలో అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలోని 13 కేసులపై జిల్లా పోలీసులు సైతం లోతుగా విచారణ చేశారు. సిట్ దర్యాప్తునకు వస్తే తక్షణ నివేదిక ఇచ్చేలా వివరాలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాకినాడ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జులై 11న రూ.26కోట్లు, జూన్ 28న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో రూ.13.96 కోట్ల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. ఇది లవన్ కంపెనీదిగా గుర్తించారు. కొటారి అమిత్‌కుమార్ అనే వ్యాపారిని నిందితుడిగా తేల్చారు. అయితే ఇదే లవన్ కంపెనీ పశ్చిమ ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి చేస్తుండగా బార్జిలో 1,060 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పట్టుబడింది. అదేరోజు కరప స్టేషన్ పరిధిలో రూ.15.31 కోట్ల బియ్యం పట్టుబడింది. ఇది ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన వినోద్ అగర్వాల్‌కు చెందిన సరళ ఫుడ్స్ కంపెనీ. ఇలా సిట్ దర్యాప్తు చేయనున్న ఈ 13 కేసులకు సంబంధించి మొత్తం రూ.84.87 కోట్ల విలువైన 22,947 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉండడం గమనార్హం. అయితే క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలు భారీగా ఉండడంతో ఆయా కంపెనీలకు పోలీసులు నోటీసులు కూడా పంపించారు. అయితే సిట్ దర్యాప్తు ప్రారంభిస్తే ఈ కేసుల ఆధారంగా నిందితులను తక్షణం అరెస్టు చేయడంతోపాటు వాటి వెనుక ఉన్న పెద్దతలలు సైతం సులువుగా దొరికే అవకాశం ఉంది. కానీ సిట్ రంగంలోకి దిగలేదు.

అక్రమార్కుల్లో ఎంచక్కా దర్జా..

రేషన్ స్మగ్లింగ్‌పై ఏకంగా సిట్ విచారణకు ఆదేశించడంతో బియ్యం అక్రమార్కులు వణికిపోయారు. పైగా సిట్‌కు అరెస్ట్‌ల అధికారం కట్టబెట్టడంతో తమ పాపం పండినట్లేనని భయపడ్డారు. ఇంతవరకు దాని ఊసే లేకపోవడంతో తమకేం కాదులే అనే ధోరణిలో ప్రస్తుతం మళ్లీ రేషన్ బియ్యం కొనుగోళ్లు మొదలుపెట్టారు. వాస్తవానికి సిట్‌ను నియమించిన తర్వాత అందులో ఉన్న కొందరు సభ్యులు గత వైసీపీ ప్రభుత్వానికి అడ్డంగా కొమ్ముకాసిన వారేనన్న విమర్శలు వచ్చాయి. దీంతో వీరిని మార్చి ప్రభుత్వం డిసెంబరు 27న మరో కొత్త సిట్‌ను నియమించింది. అందులో కొందరు పోలీసులను తప్పించి కాకినాడ జిల్లాలో బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతిని నియమించారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. అటు కొత్త సిట్‌లో సభ్యులుగా ఉన్న ఇద్దరు ఉమ్మడి జిల్లా అధికారుల్లోను అయోమయం కొనసాగుతోంది. తమను దర్యాప్తు బృందంలో సభ్యులుగా చేర్చినా విచారణకు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో వారు అయోమయంలో కొనసాగుతున్నారు.

జలకళకు నిధులు!



- ఏటిగట్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు రూ.54.57 కోట్లు మంజూరు
- ఓఅండ్‌ఎం పనులకు రూ.70.01 కోట్లతో 953 ప్రతిపాదనలు
- నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 పనుల ఆధునికీకరణ
- రబీకి నీటి ఎద్దడి లేకుండా ప్రయత్నం : ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యమైంది. వేసవిలో కనీసం కాలువల్లో పూడిక కూడా తీయని పరిస్థితి ఉండేది. డెల్టా ఆధునికీకరణ పనులు అసలు పట్టించుకోలేదు. వరదల సమయంలో ఏటిగట్లకు తాత్కాలిక పనులకోసం కూడా నానా ఇబ్బందులుపెట్టేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే వరదగట్ల అభివృద్ధి, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పటిష్టతకు రెండు విడతలుగా రూ.54.57 కోట్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభంకాగా, కొన్ని టెండర్ల దశలోనూ, కొన్ని సాంకేతిక అనుమతుల దశలోనూ ఉన్నాయి. ఇంకా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లతోపాటు గ్రోయిన్లు, డెల్టా ఆధునికీకరణ తదితర పనులకు రూ.257 కోట్ల నాబార్డు నిధులతో 322 పనులు ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించారు. అలాగే కాలువల క్లోజర్ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) పనులు చేయడానికి రూ.70.01 కోట్లతో 953 పనులు ప్రతిపాదించారు. ప్రస్తుత ఇరిగేషన్ పరిస్థితి మీద ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్‌తో 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు ప్రస్తావించారు.

● **రబీ సాగుకు నీటి లభ్యత ఏంటి..**

ఎస్ఈ : ఇబ్బంది ఉండదనే భావిస్తున్నాం. మొత్తం రబీ, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకోసం 84 టీఎంలు అవసరం. ఇప్పటికే 41 టీఎంసీలు వినియోగించారు. ఇంకా మార్చి 31వ తేదీ వరకూ 43 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం సీలేరు నుంచి 7,300 క్యూసెక్కుల నీరొస్తోంది. మొత్తం అక్కడ నుంచి 10 టీఎంసీల నీరు ఇస్తా మనే హామీ ఉంది. పోలవరం స్పిల్‌వే నుంచి 15 టీఎంసీలు వస్తాయి. సెల్ఫ్‌ఫ్లో 2.38 టీఎంసీలు ఉన్నాయి.

● **మిగతా నీటికోసం యాక్షన్ ప్లాన్..**

ఎస్ఈ : జిల్లా నీటిపారుదల అభివృద్ధి సంస్థ సమీక్ష నాటికి నీరు పుష్కలంగా ఉందనే అంచనాతో యాక్షన్ ప్లాన్ ఏమీ సిద్ధం చేయలేదు. సీలేరులో వాస్తవానికి 67 టీఎంసీల నీరు ఉంది. అవసరమైతే ప్రభుత్వ సహాయంతో మరికొంత తెచ్చే ప్రయత్నం చేస్తాం. నిజంగా శివారు ప్రాంతాల్లో ఎక్కడైనా ఎద్దడి వస్తే అప్పటికపుడు నిర్ణయాలు తీసుకోవడానికి కాకినాడ కలెక్టర్ సుముఖత తెలియజేశారు. మిగతా జిల్లాల కలెక్టర్లకు కూడా పరిస్థితిని వివరించి నీటి ఇంజన్లు ఏర్పాటు, క్రాస్‌బండ్‌ల నిర్మాణం వంటి పనులు చేస్తాం.

● **క్లోజర్ సమయంలో కాలువల పనులకు యాక్షన్ ప్లాన్ ఏమైనా ఉందా?**

ఎస్ఈ : 953 పనులు చేయడానికి రూ.70.01కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వాటితో ఆపరేషన్, మెయింటెనెన్స్ పనులు చేస్తాం.

● **వరదల సమయంలో ఈసారి ముఖ్య పనులు చేసే పరిస్థితి ఏమైనా ఉందా?**

ఎస్ఈ : డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు మంజూరుచేశారు. మొదట విడతలో 37.57 కోట్లను 73 పనులు చేయడానికి ఇచ్చారు. వీటితో ఏటిగట్ల పటిష్టత, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల అభివృద్ధి చేయనున్నాం. అంతేకాక పంపా నది స్పిల్‌వే గేట్లు రీప్లేస్‌మెంట్ పనులు కూడా ఉన్నాయి. ఈ పనులకు టెక్నికల్ శాంక్షన్ వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం. కాజ, నర్సాపురం ప్రాంతంలోని కాజ, మడుగుల తూము తదితర ప్రాంతాల్లో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను మరమ్మతులు చేస్తాం. ఇవి టెండర్ల దశలో ఉన్నాయి. ఇటీవల డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద రెండో విడత రూ.17 కోట్లు వచ్చాయి. వాటితో రాజోలు సబ్ డివిజన్‌లో అంతర్వేది పరిధిలోనూ, లూటుకుర్రు, ఆదుర్రు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు మరమ్మతులు చేయవలసి ఉంది. వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

● **డెల్టా ఆధునికీకరణ పనులేమీ లేవా?**

ఎస్ఈ : నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 ఆధునికీకరణ పనులు చేయడానికి ప్రతిపాదించాం. వీటిలో చాలా అభివృద్ధి పనులను ప్రతిపాదించడం జరిగింది.

● **అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న లస్కర్లకు జీతాల సమస్య..**

ఎస్ఈ : నిధులు వచ్చాయి. ఈనెలాఖరుకి 2024-25కి సంబంధించిన మొత్తం బకాయిలు చెల్లిస్తాం. ఇక సమస్య ఉండదు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌నుంచి తూర్పు-పశ్చిమ గోదావరి శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి సునీత, నియోజకవర్గ పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్లు, 21 మండల పరిధిలో 70,540మంది ఓటర్లు ఉండగా, వీరిలో 42,463మంది పురుషులు, 28,072మంది మహిళలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. వీరి కోసం 96 పోలింగ్‌స్టేషన్లు, రెండు ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు వెరసి 98పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దీనిలో 67 పోలింగ్ కేంద్రాలు కాకినాడ డివిజన్‌లోను, 31 కేంద్రాలు పెద్దాపురం డివిజన్‌లోను ఉన్నాయన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 25శాతం రిజర్వుతో కలిపి 123 మంది పీవోలు, 123 మంది ఏపీవోలు, 246 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని, 123మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. పోలింగ్ సహాయ పోలింగ్ అధికారులకు ఈనెల 14, 20వ తేదీల్లోను, ఓపీవోలకు ఈనెల 21న, మైక్రో అబ్జర్వర్లకు 22న కలెక్టరేట్ విధాన గౌతమి హాలులో శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26న కాకినాడ డివిజన్‌కు మెక్లారిన్ హైస్కూల్‌లోను, పెద్దాపురం డివిజన్‌కు పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలోను ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 27న కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో రిసెప్షన్ సెంటరు, ఇంటర్మీడియట్ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని 98 పోలింగ్ కేంద్రాలను 21 జోన్లు, రూట్లుగా విభజించి 21మంది రూట్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ఎన్నిక నిర్వహణకు 20శాతం రిజర్వుతో కలిపి 216 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బిందుమాధవ్, అడిషనల్ ఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి, ఏఆర్‌వో వెంకట్రావు, ఎన్నిక విభాగ సూపరింటెండెంట్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధార్ ఎన్రోల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఆధార్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0నుంచి 5ఏళ్ల వయసు గల పిల్లల 70వేలమందికి ఆధార్ నమోదు చేయాల్సి ఉందన్నారు. చిన్నారుల ఆధార నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టిపెట్టి వేగవంతం చేయాలన్నారు. డీ-యాక్టివేషన్ నివారించడానికి పిల్లల అందరి బయోఅప్డేట్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులందరికీ ఆధార్ సంఖ్య నమోదు చేయాలన్నారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. 15నుంచి 17ఏళ్ల వయస్సులోని వారి మాండేటరీ బయోమెట్రిక్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో మొత్తం 97 ఆధార్ కిట్లకుగాను 82 ఆధార్‌కిట్లు వివిధ మండలాల్లో పనిచేస్తున్నాయన్నారు. మిగిలినవి 15 సాంకేతిక లోపం కారణంగా వినియోగించడం లేదన్నారు. ప్రతి ఆధార్ కేంద్రంలో వివిధ సేవలను సంబంధించి వసూలు చేసే ధరల వివరాలతో కూడిన పోస్టర్లను కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, జిల్లా ఆధార్ మేనేజర్ గిరిధర్, గ్రామ, వార్డు సచివాలయ సమన్వయకర్త శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, డీపీవో రవికుమార్, పోస్టల్ పీఆర్ఐపీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బరిలో 35 మంది

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ 7
- మొత్తం 54మంది దాఖలు
- స్క్రూట్నీలో 11 నామినేషన్ల తిరస్కరణ
- పోటీ నుంచి 8మంది విరమణ

కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి 7

- సీఎం చంద్రబాబును కోరిన కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి

ఏ దివిలో మెరిసిన పారిజాతమో...
ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో...
నా మదిలో నీవై నిండిపోయెనే...

హృదయం ఎక్కడున్నది... హృదయం ఎక్కడున్నది...
నీ చుట్టూనే తిరుగుతున్నది...

మనసున ఉన్నది... చెప్పాలనున్నది... మాటలు రావేలా...

ఇది చెరగని ప్రేమకు శ్రీకారం...
ఇది మమతల మేడకు ప్రాకారం...

...ఇలా రచయితలెందరో ప్రేమ గురించి వర్ణించారు.

ప్రేమ అంటే... ఏదో తెలియని ఫీలింగ్.. రెండక్షరాల ఈ మాట రెండు హృదయాలను ఒక్కటి చేస్తుంది.... ఎక్కడ ఉన్నా పక్కన నువ్వే ఉన్నట్టుంటుందీ... అదేం గారడీ అనుకునే ప్రేమ జీవులు ఎదురుచూసే రోజే వాలెంటైన్స్‌డే.

ప్రేమంటే... రెండు గుండెలు, మూడు ముళ్లు, ఏడు అడుగులు మాత్రమే కాదు. జీవితాంతం ఒకరినొకరు గౌరవించుకుంటూ సాగిపోవడమే అసలైన ప్రేమ.

ప్రేమంటే అనురాగ బంధం.... అనురాగ మంత్రం... అనిర్వచనీయ అనుభూతి... మరపురాని, మరువలేని భావోద్వేగం.... ఇలా ప్రేమకు ఒక్కొక్కరు ఒక్కో నిర్వచనం చెప్తారు.

తొలి చూపులోనే ప్రేమలో పడి పెద్దలను ఒప్పించి పెళ్లి పీటలు ఎక్కిన వారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎందరో ఉన్నారు.

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అందులో కొందరి 'ప్రేమ' ఊసులు...

ఏదో... ఫీలింగ్




సుభాష్-లక్ష్మీసునీత

సీతారాముల కల్యాణంలో ప్రేమకు శ్రీకారం

పెద్దల అంగీకారంతో పరిణయం

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి)

2007లో శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం జరుగుతుండగా ఆలయంలో లక్ష్మీసునీతను చూశాను. తొలిచూపులోనే ఇష్టపడ్డాను. ఆమె గురించి వాకబు చేశాను. నాయనమ్మకు చూపించారు. రెండుసార్లు నా ప్రేమ గురించి చెప్పాను. మౌనమే ఆమె సమాధానం. చివరకు పెద్దల ఇష్టమని చెప్పింది.

నా ప్రేమ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాను. మా తాతగారు అంగీకరించలేదు. లక్ష్మీ సునీతనే వివాహం చేసుకుంటానని పట్టుబట్టాను. మా నాన్నగారు పెద్ద మనసుతో అర్థం చేసుకుని సునీత తల్లిదండ్రులతో మాట్లాడారు. రెండు కుటుంబీకుల అంగీకారంతో ఇద్దరం ఒక్కటయ్యాము.

సునీత జన్మదినం ఏప్రిల్ 19. మా వివాహం 2009 ఏప్రిల్ 19న అమలాపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. మా ప్రేమకు ప్రతిరూపంగా 2018 జూలై 11న సత్యదివిత, సత్యదీక్షిత (కవలలు) జన్మించారు.

వాసంశెట్టి సుభాష్
కార్మిక శాఖ మంత్రి

హాకీ కలిసింది ఇద్దరినీ...


రవిరాజా-నాగమణి

వి.రవిరాజా, ఫిజికల్ డైరెక్టర్

1995లో క్రీడల పట్ల మక్కువతో హాకీ ఆడేందుకు జిల్లా క్రీడా మైదానానికి వెళ్లేవాడిని. ఆ సమయంలోనే హాకీ క్రీడాకారిణిగా వచ్చిన నాగమణిని చూసి ప్రేమలో పడ్డాను. అభిప్రాయాలు దగ్గరగా ఉండడంతో ఇష్టపడ్డాం. ఈ క్రమంలో 1999లో ట్రైనింగ్‌కి వెళ్లి 2002లో పీఈటీలుగా ఉద్యోగాలు సంపాదించాం. ఇద్దరం ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాత తల్లిదండ్రులతో మాట్లాడి 2003లో వివాహం చేసుకున్నాం. ఇద్దరమ్మాయిలు పుట్టారు. పెద్దమ్మాయి ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్, రెండో అమ్మాయి అగ్రికల్చర్ బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఫిజికల్ డైరెక్టర్లుగా ఇద్దరం ఒకేసారి ఉద్యోగోన్నతి పొందాం. ఇప్పటికీ ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించుకుంటూ ప్రేమను వ్యక్తపరుచుకుంటాం.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)

ప్రైవేటులో ప్రేమ


గెద్దం ఫిలిప్‌రాజు-లక్ష్మీజ్యోతి

తను మెట్రిక్యులేషన్‌కు, నేను డిగ్రీకి లెక్చరర్ కె.వెంకటేశ్వర్లు వద్ద ఇంగ్లిషు ప్రైవేటుకు వెళ్లేవాళ్లం... అప్పుడే మనసులు కలిశాయి. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 1993లో పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాము. ఆనాటి అన్యోన్యమే నేటికీ కొనసాగుతోంది.

గెద్దం ఫిలిప్‌రాజు

మలికిపురం (ఆంధ్రజ్యోతి)




కాకినాడ భానుగుడి సెంటర్లోని విక్రయ దుకాణాల్లో బొకేలు, గిఫ్ట్‌లు

ప్రేమికుల రోజున తమ ప్రేయసికి... లేకుంటే ప్రియునికి... మనసులోని భావాలను మధురమైన రూపంలో చెప్పాలని... అందమైన ప్రతిమలుగా అందించాలని తహతహలాడే ప్రేమికుల కోసం దుకాణాల్లో కళ్లు చెదిరే ప్రేమ కానుకలు కొలువుదీరాయి. ప్రేమ చిహ్నమైన హృదయాకారంలో వివిధ ఆకృతుల్లో మదిని దోచేస్తున్నాయి. సుదూర ప్రాంతంలో ఉన్న ప్రేమికులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకునేందుకు ఆన్‌లైన్‌లో బహుమతులు పంపుకుంటున్నారు. ఒకే ప్రాంతంలో ఉన్న ప్రియుడు, ప్రియురాలు ఒకరినొకరు సర్‌ప్రైజ్ చేసేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.



అసలు ప్రేమికుల రోజును ప్రపంచమంతా జరుపుకుంటారా? అంటే లేదనే సమాధానం వినిపిస్తోంది. ప్రతిఏటా ఫిబ్రవరి 14న అమెరికా, కెనడా, మెక్సికో, లండన్, ఆస్ట్రేలియా, భారత్, ఇటలీ, డెన్మార్క్, జపాన్‌ల్లో మాత్రమే జరుపుకుంటున్నారు. మూడో శతాబ్దంలో రోమ్ రాజ్యాన్ని క్లాడియస్ అనే చక్రవర్తి పాలిస్తుండేవాడు. సెయింట్ వాలెంటైన్ ఆ రాజ్యంలో ఓ ప్రవక్త. పురుషులు పెళ్లి చేసుకుంటే సైన్యంలో చేరడం తగ్గిపోతుందనే ఉద్దేశంతో పెళ్లిళ్లను క్లాడియస్ రద్దు చేశాడు. అయితే ప్రేమ, పెళ్లి దేవుడికి వ్యతిరేకం కాదని బోధిస్తూ రహస్యంగా ప్రేమికులకు వాలెంటైన్ పెళ్లిళ్లు చేస్తుండేవాడు. ఇది రాజుకు తెలిసి అతడికి మరణశిక్ష విధించాడు. ఫిబ్రవరి 14న దానిని అమలు చేశారు. తన కూతురిని ప్రేమించిన వాలెంటైన్‌ని రాజు ఉరి తీయించాడనే మరో కథనం కూడా ఉంది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కన్నుల్లో నీ రూపమే గుండెల్లో నీ ధ్యానమే


శ్రీనివాస్-కమలకుమారి

మొదటి ప్రేమ అంటే ఇలాగే ఉంటుందని ఆమెను చూసిన తర్వాతే తెలిసింది. 1996లో ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో ఒక అమ్మాయిని చూశాను. తొలి చూపులోనే ఆమెతో (కమలాకుమారి) ప్రేమలో పడ్డాను. ఎవరిని చూసినా ఆమె రూపమే కనిపించేది. ఇరువైపులా తల్లిదండ్రుల సహకారంతో 2005 డిసెంబరు 15న వివాహ బంధంతో ఇద్దరం ఒక్కటయ్యాం. ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. పెళ్లి సమయానికి జాబ్ లేదు. ఇంతలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు (ఆర్టీవో) డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. నా భార్య ఇచ్చిన సపోర్టుతో ఉద్యోగం సంపాదించాను. మా ప్రేమ మొదలై సుమారు 25 సంవత్సరాలైంది. అప్పటికీ, ఇప్పటికీ ఆమెపై నా ప్రేమ అలాగే ఉంది.

బి.శ్రీనివాస్,
మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)

కనులవిందు.. నరసన్న తెప్పోత్సవం

- హంస వాహనంపై విహరించిన నృసింహుడు
- స్వామికి ఘనంగా శ్రీపుష్పోత్సవం
- పవళింపు సేవ.. ముగిసిన తీర్థ మహోత్సవాలు


పుష్పక వాహనంపై విహరిస్తున్న శ్రీలక్ష్మీనరసింహుడు

అంతర్వేది, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం స్వామివారికి పుష్పక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం అప్పనపల్లి వాసి దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు నిర్మించిన పుష్పక వాహనంపై స్వామిని మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగించి ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఏర్పాటుచేసిన చెరువు వద్దకు తీసుకొచ్చారు. తొలుత అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై తెప్పోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నృసింహ నామాలతో జేజేలు పలికారు. బాణసంచా కాల్పులతో కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజవరపు రంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్, దాత గొట్టిముక్కల భీమరాజు, ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమార రామగోపాల రాజాబహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆర్డీవోలు కె.మాధవి, అఖిల, డీఎస్పీ మురళీమోహన్, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జినాయుడు, బైరా నాగరాజు, కడలి వెంకటరత్నం పాల్గొన్నారు. రాత్రి స్వామివారికి తిరుమంజనాలు, దర్పణ సేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో నరసన్నకు ఘనంగా శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. చెంగోల విన్నపం అనంతరం స్వామి పవళింపు సేవతో తీర్థ మహోత్సవాలు ముగిశాయి.

పుష్కరిణి సంప్రోక్షణ

నరసింహస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించేందుకు ఆలయ ఉత్తర ఈశాన్య భాగంలో నూతన పుష్కరిణి ఏర్పాటు చేశారు. తొలుత త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన ప్రయాగ్‌రాజ్ జలాలతో నూతన చెరువుకు సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవ ఏర్పాట్లను ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ మురళీమోహన్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ గురువారం తెప్పోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన పుష్కరిణి వద్ద ఎటువంటి తొక్కిసలాట జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మనోహరం.. భీమేశ్వరుని జలవిహారం


హంసవాహనంపై విహరిస్తున్న భీమేశ్వరుడు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి తెప్పోత్సవం సప్తగోదావరి నదిలో నయన మనోహరంగా జరిగింది. రాత్రి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని మంగళ వాయిద్యాల మధ్య సప్త గోదావరిలో విద్యుద్దీపాలు, పుష్పాలంకృతమైన హంసవాహనంపై ఆసీనులను చేశారు. వేద పండితుడు బులుసు రామకృష్ణ బృందం చేసిన ఆస్థాన పూజ అనంతరం స్వామివారు జలవిహారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తన్మయత్వంతో తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

17, 19 తేదీల్లో కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి ఈనెల 17, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సుకు టికెట్స్ కావాల్సిన భక్తులు ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ బస్సులు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో అయోధ్య, వారణాసి క్షేత్రాలు చూపించి ఏడు రోజుల అనంతరం కాకినాడ చేరుతుందన్నారు. ఈ బస్సుకు టిఫిన్స్, భోజనాలతో సహా ఒకో టిక్కెట్‌కు 10వేలుగా నిర్ణయించారన్నారు. టికెట్స్ బుకింగ్ కోసం 73829 10869, 73829 10778 నెంబర్లను సంప్రదించలన్నారు.

16 నుంచి అచ్యుతాపురం రైల్వేగేటు మూసివేత

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరం పరిధిలో ఉన్న అచ్యుతాపురం రైల్వేగేటును ఈనెల 16వతేదీ నుంచి మూసివేస్తున్నట్లు కాకినాడ రైల్వే సెక్షన్ ఇంజనీరు రమేష్, అసిస్టెంట్ ఇంజనీరు శాస్త్రి తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మరమ్మతుల నిమిత్తం 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పదిరోజులపాటు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. అచ్యుతాపురం పరిసర ప్రాంతాల వాసులు ప్రత్యామ్నాయ మార్గాలద్వారా పయణించి రైల్వేఅధికారులకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. మరమ్మతులు పూర్తి అయ్యిన తర్వాత వాహనాల రాకపోకల యధావిధిగా సాగుతాయన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచిడెల్టా కాలువలకు 8850క్యూసెక్కుల విడుదల చేస్తుండగా గోదావరి నీటి లభ్యత 8618క్యూసెక్కులుగా ఉంది. గోదావరిలో నీటి లభ్యత తగ్గుతూ ఉండటంతో పాండ్‌లో నిల్వ ఉన్న నీటిని విడుదల చేస్తున్నారు. దీని వల్ల గోదావరి నీటి మట్టం నాలుగు రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. సోమవారం 9.95 అడుగులుగా ఉన్న నీటి మట్టం గురువారం నాటికి 9.45 అడుగులకు చేరుకుంది. సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కులు గోదావరికి విడుదలవుతుండగా బైపాస్ మార్గం ద్వారా మరో 3వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో పోలవరం వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం నుంచి నీరు దిగువకు ప్రవహించడంతో ఉన్న అడ్డంగుల వల్ల ధవళేశ్వరం వద్దకు చేరడం ఆలస్యమవుతోంది. దీంతో పాండ్‌లో ఉన్న నీటిని గోదావరికి విడుదల చేస్తూ ఉండడంతో నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. కాగా గురువారం తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మించిన

భవనాల గుర్తింపు



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) చోళుల కాలంలో సర్పవరంలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ సమీపంలో ఆగమ శాస్త్రం నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. ఆలయ నిర్మాణం, పూజలు, ఆచారాలు వంటి వాటికి సంబంధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆలయం గోపురం, ధ్వజస్తంభం, ప్రహరీ నుంచి సుమారు 200 మీటర్ల మేర గాలి గోపురం కంటే ఎత్తులో ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలున్నాయి. అయితే భావనారాయణ స్వామి తూర్పు దిక్కులో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, రోడ్డు వెలుపలకు వచ్చి జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల మనోభావాలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలను అడ్డుకోవాలని పురావస్తు శాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

సర్పవరంలో పర్యటించిన పురావస్తుశాఖాధికారులు

ఈ మేరకు గురువారం కాకినాడ జిల్లా పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు దేవాదాయ,ధర్మాదాయ శాఖ సిబ్బందితో కలసి సర్పవరం పర్యటించారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో జరుగుతోన్న బహుళ అంతస్తుల భవనాలు, రోడ్డు వెలుపలకు వచ్చి నిర్మించిన పలు కట్టడాలను గుర్తించారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రాకారానికి ఎత్తులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఇటువంటి భవన నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వరాదన్నారు. ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మించిన భవన యాజమానులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

జబర్దస్త్ నటుల సందడి



కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంలో శ్రీసత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా గురువారం రాత్రి జబర్దస్త్ నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా నటుల రాకతో వారి చేసే కామెడీ ప్రదర్శనను పెద్దఎత్తున తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

ముగిసిన నరసింహస్వామి అధ్యయనోత్సవాలు



కోరుకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి అధ్యయన మహోత్సవాలు గురువారం ముగిశాయి. భీష్మ ఏకాదశి రోజున చేపట్టిన ఈ అధ్యయనోత్సవాలు 5రోజుల పాటు నరసన్న కొండపైన అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గురువారం కొండపైన బేడా ఉత్సవం, శ్రీ నన్నార్వాళ్ల పరమ పద ఉత్సవం నిర్వహించారు. అనంతరం 5రోజులు కొండపై ఉండి పూజలందుకున్న లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దిగువ దేవస్థానానికి తీసుకువచ్చారు.

శేష వాహనంపై గ్రామోత్సవం

శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి గ్రామోత్సవం శేషవాహనంపై కన్నుల పండువగా జరిగింది. నరసింహస్వామి అధ్యయనోత్సవాలు ముగిసిన సందర్భంగా గురువారం రంగనాథస్వామి ఆలయంలో రెండు రోజులపాటు జరిగే అధ్యయనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సేవాకాలం, రాత్రి బేడా ఉత్సవం జరిగాయి.

పూట గడవడానికి...
నాటు తెప్ప..!





కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం సుబ్బంపేట తీరంలో నాటు తెప్పపై వేటకు వెళుతున్న మత్స్యకారుడు

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాలకు చెందిన మత్స్యకార కుటుంబాల్లో కొందరికి నాటు తెప్పే జీవనాధారం. అయితే లక్షల వ్యయంతో బోట్లు తయారు చేయించుకుని కోట్లు సంపాదించుకున్న మత్స్యకారులు ఉన్నారు. అదే మత్స్యకార కుటుంబాల్లో ఏ పూటకో పూట వేటకు వెళితే కానీ ఇల్లు గడవని పరిస్థితి. ఇదే తరహాలో ఇంకా నేటికీ ఉప్పాడ తీరప్రాంత గ్రామాల్లో అనేక కుటుంబాలు ఉన్నాయి. వారిలో చాలా మంది కర్ర తెప్పలు, కొందరు నాటు తెప్పలు(థర్మోకోల్ అట్టలు) తయారు చేసుకుని వేటకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఇలా కర్ర, నాటు తెప్పలతో మత్స్యకారులు సముద్రం ఒడ్డు నుంచి సుమారు 100 నుంచి 200 మీటర్ల మేర వేట చేస్తారు. అదృష్టం బాగుంటే ఆ రోజు కూలి పనుల డబ్బులు గిట్టుబాటు అవుతాయి. లేకుంటే ఆ రోజుకు కష్టం వృథాగా పోతుంది. పేద, బడుగు మత్స్యకారులకు ఫైబర్ తెప్పలను ప్రభుత్వం మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్లాన్ చేసి... అన్నను బురిడి కొట్టించిన తమ్ముడు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడిన ఓ తమ్ముడు(వరుసకు) అన్నకే కన్నం వేశాడు. త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్యాపురానికి చెందిన సుమన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి వర్క్‌ఫ్రం హోం చేస్తూ రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. ఈనెల 7న పీ అండ్ టీ కాలనీలో నివాసం ఉంటున్న చిన్నమ్మ కొడుకు ఉయ్యూరి ప్రభు రవితేజతో కలిసి బైక్‌పై వెళుతుండగా కోరుకొండ రోడ్డు మార్కెట్ యార్డు వద్దకు వచ్చేసరికి మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అటకాయించి కత్తితో బెదిరించి 2సెల్‌ఫోన్లు, 4 కాసుల బంగారు గొలుసు, 2 ఉంగరాలు దోచుకెళ్లారు. దీనిపై త్రీటౌన్‌లో సుమన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయం బయటపడింది. విచ్చలవిడిగా తిరగడం అలవాటైన రవితేజకు సుమన్ బంగారు వస్తువులు, ఖరీదైన సెల్‌ఫోన్‌పై కన్ను పడింది. తన స్నేహితుడైన తాడితోట శాంతిపురానికి చెందిన మంతెన గోపి, అల్కాట్‌తోటకు చెందిన నీలాపు శ్యాం సుందర్ రెడ్డితో కలిసి ప్లాన్ చేశాడు. సుమన్‌ని బైక్‌పై కోరుకొండ రోడ్ వైపు తీసుకెళ్లగా ఆ ప్లాన్‌ని అమలు చేశారు. తన సెల్‌ఫోన్, ఒక ఉంగరాన్ని కూడా భయపడి గోపి, శ్యాంకి ఇచ్చేసి సుమన్‌ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిజం కక్కలేక తప్పలేదు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ పేర్కొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

6.200 కిలోల గంజాయి స్వాధీనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో గురువారం 6.200 కిలోల గంజాయితో పాటూ ముగ్గురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపే చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో గురువారం సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ దండుపుంతకు చెందిన వలస గిరిధర్, స్థానిక ఏపీఎస్పీ ఇందిరాకాలనీకి చెందిన మీశాల వివేక్ అనే యువకులతో పాటూ సీసీఎల్ (మైనర్) ముగ్గురు కలిసి రమణయ్యపేట కాలువ బండ వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న 6.200 కిలోల గంజాయిని గుర్తించి పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఏ పనీపాటూ లేకుండా మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారి డబ్బుల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లా ధారకొండ నుంచి గంజాయి తీసుకువచ్చినట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు గంజాయిని రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టప్రకారం ఎస్ఐ శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



గంజాయి, పట్టుబడ్డ ముగ్గురు నిందితులతో సర్పవరం పోలీసులు

బరిలో 35 మంది

- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం 54మంది నామినేషన్లు దాఖలు
- స్క్రూట్నీలో 11 నామినేషన్ల తిరస్కరణ
- పోటీ నుంచి 8మంది విరమణ

ఏలూరు/రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. బరిలో 35 మంది పోటీ పడుతున్నారు. మొత్తం 54మంది నామినేషన్లు దాఖలు చేయగా 11మందిని స్క్రూట్నీలో తిరస్కరించారు. మరో 8మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈనెల 27న జరగనున్న పోలింగ్‌లో 35మంది బరిలో నిలిచారు. ఇందులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థిగా డీవీ రాఘవులు, స్వతంత్ర్య అభ్యర్థిగా మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ కొడుకు జీవీ సుందర్, రాజమండ్రికి చెందిన రిటైర్డ్ సీటీవో బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి వంటి వారు కూడా పోటీలో ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,13,126ఓట్లు ఉన్నాయి. ఈ స్థానాన్ని ఎలాగైనా గెలిపించుకోవాలనే లక్ష్యంతో అధికార కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈనెల 27న ఉదయం 8 నుంచి 4 గంటల వరకు జరిగే పోలింగ్ ఏర్పాట్లపై ఏలూరు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కానుంది.

రంగంలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం(కూటమి అభ్యర్థి), దిడ్ల వీరరాఘవులు(పీడీఎఫ్), కాట్రు నాగబాబు, షేక్ హుస్సేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాంగ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నేరి, దొరబాబు యాళ్ల, నీలిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణశర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్ రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవీప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్‌బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్జుల, జీవీ సుందర్, హసన్ షరీఫ్ బరిలో నిలిచారు. ఉపసంహరించుకున్న వారి పేర్లు... గద్దె విజయలక్ష్మి, డాక్టర్ కవల నాగేశ్వరావు, పచ్చిగోళ్ల దుర్గారావు, పేరాబత్తుల సత్యవాణి, బాలాజీ గుండుమోలు, పిళ్లంగోళ్ల లీలా నగేష్, సత్తిరాజు స్వామి, చక్రపాణి.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : వెట్రిసెల్వి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని ఏలూరు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సమక్షంలో పోటీలో నిలిచిన అభ్యర్థులతో వెట్రిసెల్వి గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా పాటించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు తావివ్వద్దని సూచించారు. టీవీ, ఇతర సోషల్ మీడియా ప్రచారం కోసం మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు సంప్రదించాలని కోరారు. ఏఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

సత్తిరాజుస్వామి నామినేషన్ ఉపసంహరణ

టీడీపీలో చేరిక..పేరాబత్తులకు మద్దతు

అమలాపురం/ఏలూరు ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన సత్తిరాజు ఎస్వీయూఆర్ స్వామి నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం స్వామి తన నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. ఎమ్మెల్సీ పోటీ నుంచి వైదొలిగి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పనిచేయాలని టీడీపీ అధిష్ఠానం కోరడంతో స్వామి ఈ నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉపద్రష్ట నాగార్జున వెంట ఉండి స్వామితో విత్ డ్రా చేయించారు. అలాగే సత్తిరాజుస్వామి తన మిత్రులతో కలిసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడును వారు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కోసం పని చేయాల్సిందిగా ఆయన కోరారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన సత్తిరాజుస్వామి

మోటార్‌సైకిల్ అదుపు తప్పి...
బాలుడి మృతి

- మరో బాలుడికి తీవ్రగాయాలు
- పెద్దాపురంలో ఘటన



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ



చికిత్స పొందుతున్న సత్యదుర్గాగణేష్



మృతిచెందిన నాగూర్(ఫైల్‌ఫొటో)

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో మహారాణి కళాశాల సమీపంలో అతివేగంతో మైనర్లు నడుపుతున్న మోటార్‌సైకిల్ నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో డేగల నాగూర్(15) అనే బాలుడు చికిత్స పొందుతూ కాకినాడ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో బాలుడు పెనుగొండ సత్య దుర్గాగణేష్(14) తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్దాపురానికి చెందిన వారిద్దరూ గురువారం సాయంత్రం పెద్దాపురం నుంచి సామర్లకోట వైపునకు మోటార్ సైకిల్‌పై అతి వేగంగా వస్తూ ఎదురుగా యూటర్న్ చేస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో యాక్సిస్ మోటార్‌సైకిల్ ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొని అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యింది. సమాచారం తెలిసిన వెంటనే పెద్దాపురం ఎస్ఐ మౌనిక తన సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని పోలీసు వాహనంలోనే బాలురను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగూర్ మృతిచెందాడు. తీవ్రగాయాలతో సత్య దుర్గాగణేష్‌తోపాటు మరొక వ్యక్తి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం జన్మ నక్షత్ర పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువజామున రెండుగంటలకు స్వామి, అమ్మవార్ల మూలవరులను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలను ధరింప చేశారు. ప్రత్యేకపూజలు సందర్భంగా ఉదయం 6.30కు సర్వదర్శనాలకు అనుమతించారు యాగశాలలో ఆయుష్యహోమం నిర్వహించారు. మఖనక్షత్ర పూజలకు 17 జంటలు టిక్కెట్లు కొనుగోలుచేసి వీటిలో పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శానిటరీ నిర్వహణపై చేతులెత్తేసిన కాంట్రాక్ట్ సంస్థ

చేయలేమని అన్నవరం దేవస్థానానికి లేఖ

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శానిటరీ నిర్వహణను దక్కించుకున్న కె.ఎల్.టి.ఎస్ సంస్థ తమ గడువు పూర్తయిందని నిర్వహణ చేయలేమని దేవస్థానానికి లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పారిశుధ్య కార్మికులు, నిర్వహణ మెటీరియల్‌కు దేవస్థానం కెఎల్‌టీఎస్ సంస్థకు ప్రతినెలా ప్రస్తుతం రూ.52.70 లక్షలు చెల్లిస్తుండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండరు దక్కించుకున్న ఈ సంస్థ కాలపరిమితి గతేడాది నవంబరుతో ముగిసింది. నూతన టెండర్లకు దేవాదాయ కమిషనర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అదే సంస్థతో ఇప్పటివరకు కొనసాగించారు. తాజాగా లేఖ అందజేయడంతో ఏమిచేయాలా అనేదానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దేవదాయ కమిషనర్ ఆదేశాలు వచ్చే వరకూ దేవస్థానమే నిర్వహించాలా లేకుంటే స్థానికంగా ఉన్న మరో సంస్థకు అప్పగించాలి అనే ఆలోచనలో ఉన్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. దేవదాయ కమిషనర్ ఆదేశానుసారం వ్యవహరిస్తామని అన్నారు.

అన్నవరం దేవస్థానం కాంట్రాక్టర్‌కు
వినియోగదారుల ఫోరం భారీ వడ్డన

అన్నవరం/కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో మొబైల్ డిపాజిట్ కౌంటర్‌లో నిర్దిష్టమైన చార్జీలకన్నా అధికచార్జీ లు వసూళ్లు చేస్తున్నందున సంబంధిత కాంట్రాక్టర్‌కు సీహెచ్ రఘుపతి వసంతకుమార్, చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వర్ రావ్‌లతో కూడిన కాకినాడ వినియోగదారుల కమిషన్ భారీగా జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన జల్లి గంపల లక్ష్మీనారాయణ గత ఏడాది నవంబరు 3వ తేదీన అన్నవరం సత్యన్నారాయణస్వామి దైవ దర్శనార్థం రూ.రెండు వందలతో టికెట్‌ను కొనుగోలుచేసి అనంతరం తన మొబైల్ ఫోన్‌ను సత్యదేవ మొబైల్ అండ్ కెమెరా డిపాజిట్ సెంటర్ ఈస్ట్ వన్‌లో డిపాజిట్ చేశాడు. దర్శనానంతరం ఈ బిల్ ద్వారా మొబైల్ ఫోన్ తీసుకునేందుకు డిపాజిట్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ అదనంగా రూ.10 ఇవ్వాలని అడగ్గా ఏ బోర్డుపైన చెల్లించ వల్సిన రుసుము రూ.10ఏ బోర్డుపైన ఎందుకు ప్రదర్శించలేదని లక్ష్మీనారాయణ కౌంటర్‌లో ఉన్నవారిని అడిగాడు. దాంతో రూ.10 చెల్లించకపోతే మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వమని వారు బదులిచ్చారు. వెంటనే లక్ష్మీనారాయణ సంబంధిత దేవస్థాన అధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా స్పందించలేదు. దాంతో ఆయన గత ఏడాది డిసెంబరు 4న వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం కమిషన్ రూ.5 వసూలు చేయడానికి మాత్రమే అనుమతి ఉందని, అయితే కాంట్రాక్టర్ మరో రూ.5ను అదనంగా వసూలు చేయడం తప్పిదంగా పరిగనిస్తూ ఫిర్యాదుకి కాంట్రాక్టర్ రూ.15 వేలు, అలాగే వ్యాజ్యం ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే కాంట్రాక్టర్ దేవస్థానం యాజమాన్యానికి రూ.5లక్షలు జరిమానాగా చెల్లించాలని ఆదేశించింది. రెగ్యులేటరీ చర్యలలో భాగంగా దేవస్థానంలో అన్ని దుకాణాలలో సుంకం బోర్డులు ప్రదర్శించాలని మరింత దుర్వినియోగాలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తూనికలు, కొలతలు శాఖకు సూచించింది.

వరుస ఫిర్యాదుల నేపథ్యంలో
మేల్ నర్సుపై విచారణ

- ప్రత్యేక కమిటీ నియామకం

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా పనిచేస్తున్న పోలాబత్తిన శ్రీనివాస్‌రావుపై వరుస ఫిర్యాదులు వస్తున్న నేపథ్య లో కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆర్ఎంసీ ఏడీ శ్రీనివాస్‌లను విచారణాధికారులుగా నియమిస్తూ అలాగే సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చైర్మన్‌గా ఒక ప్రత్యేక కమిటీని నియమించారు. ఇటీవల శ్రీనివాసరావు ఖాళీ పత్రాలపై సుమారు 60మంది స్టాఫ్ నర్సులతో సంతకాలు చేయించాడు. వారు ఎందుకు అని ప్రశ్నిస్తే నర్సుల సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించేందుకు అని చెప్పాడు. ఈవిషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టి అతను నర్సులను తప్పుదోవ పట్టించాడని తనకు గిట్టని వారిపై కక్షపూరితంగా ఖాళీపత్రాలపై సంతకాలు చేయించాడని అధికారులు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ విషయంపై శ్రీనివాసరావు ఎన్‌జీవో సంఘ నాయకుల పేర్లను వాడుకోవడంపై ఆ సంఘ నాయకులు శ్రీనివాస్‌రావుపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ ద్వారా తనకు అవార్డు ఇచ్చేందుకు ఆసుపత్రి అధికారులు సిఫార్సు చేయలేదన్న అక్కసుతో అధికారులను రకరకాల బెదిరింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ ఈవిషయాన్ని తీవ్రం గా పరిగణలోకి తీసుకున్నారు. నిజానిజాలను రాబట్టేందుకు ప్రత్యేకకమిటీ నియమించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించిన నేపథ్యంలో కమిటీ ఏర్ప డింది. ఈనెల 15వ తేదీలోపు విచారణ పూర్తిచేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశాలలో తెలియజేశారు.

కోనసీమ ప్రభల ఉత్సవాన్ని
రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

- సీఎం చంద్రబాబును కోరిన కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి



అమరావతిలో సీఎం చంద్రబాబుకు కోనసీమ ప్రభల ఉత్సవంపై లేఖను అందిస్తున్న కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి

అంబాజీపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిచెందిన కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ పొదపాటి తేజస్వి కోరారు. ఈ మేరకు అమరావతిలో చంద్రబాబుకు జగ్గన్నతోట ప్రభల తీర్థ విశిష్టతను వివరిస్తూ లేఖను అందించారు. 450 ఏళ్ళకు పైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రతి ఏటా కనుమ రోజున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోట లో నిర్వహిస్తారన్నారు. ఈ తీర్థానికి దేశవిదేశాలలో ఉన్న సుమారు 4 లక్షలకు మందికిపైగా భక్తులను ఆకర్షిస్తూ, కోనసీమ ప్రాంతపు సంప్రదాయాలకు, ప్రజా సంస్కృతికి ప్రతిబింభంగా నిలుస్తోందన్నారు. ఈఉత్సవాన్ని ప్రధాని నరేంద్రమోదీ, భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖ ప్రశంసించాయన్నారు. ఈ ప్రతిపాదనను ఇప్పటికే పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌కు సమర్పించినట్లు తేజస్వి తెలిపారు. ఈ విషయంపై సానుకూలంగా స్వీకరించారన్నారు. కోనసీమ ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇవ్వడంవల్ల తెలుగు సంస్కృతి పునరుద్ధరించడమే కాకుండా స్థానికంగా ఘనంగా జరుపుకునే సంప్రదాయాలకు మరింత గౌరవం చేకూరుతుందని తేజస్వి పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను సీఎం సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తేజస్వి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య



మృతురాలు దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వివాహిత మహిళ పిల్లలతో సహ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని చిక్కాలలో జరిగింది. ఎస్ఐ కే నరేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం బొర్రా దుర్గాభవానికి (35), సురేంద్ర గౌడ్‌తో పదమూడు సంవత్సరాల క్రితం వివా హం జరిగింది. వారికి అమ్మాయి జోత్స్న రత్నశ్రీ (11), అబ్బా యి జయదీప్ (9) ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు, గత కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు చోటుచేసుకున్నాయి. కుటుంబ ఆర్థికఇబ్బందులు తీరకపోగా మరింత ఎక్కువ కావడంతో ఆమె మానశింగాను డిప్రెషన్‌కు గురైంది. అన్నయ్య ఆమెను స్థానికంగానే వారి ఇంటికి తీసుకుని వెళ్లాడు. భర్త లారీపై కిరాయితో హైదరాబద్‌కు వెళ్లాడు. ఎవరు లేని సమయంలో ఇంటి వద్దనే కలుపు మందు పిల్లలకు తాగించి ఆమె తాగింది. తాను చనిపోతే పిల్లలు ఆలన పాలన ఉండదని, ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారికి కూడ పురుగుమందు తాగించింది. విష యం తెలుసుకున్న బంధువులు వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దుర్గాభవాని మార్గమధ్యలోనే మరణించింది. పిల్లలు రాజమహేంద్రవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. మృతురాలి అన్నయ్య రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆబోతును ఢీకొని వ్యక్తి మృతి



మురళీకృష్ణ(ఫైల్)

అంతర్వేది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన మురళీకృష్ణ బుధవారంరాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆబోతును ఢీకొని మృతి చెందినట్టు భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపారు. సంవత్సరం క్రితం వివాహమైన మురళీకృష్ణకు జనవరి నెలలో పాప పుట్టింది. గురువారం భార్యతో మోరిపోడు వెళ్లివస్తానని చెప్పిన మురళీకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఇరువురు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి తేలారు. మోటారుసైకిల్‌పై వెళుతున్న మురళీకృష్ణ ఆబోతును ఢీకొనడంతో మెడపై తీవ్ర గాయమై రక్తస్రావంతో పడి ఉన్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారని ఫిర్యాదులో శిరీష పేర్కొన్నారు.

వైన్‌షాపులపై మెరుపుదాడులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించిన వైన్‌షాపుల పై కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో మెరుపుదాడులు నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాదవ్ ఆదేశాను సారం ఎస్‌డిపిఓ ప్రత్యేక పోలీస్ బలగాలతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 10గంటల తరువాత తెరచి ఉంచిన వైన్‌షాప్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులు కాకినాడ సిటీలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు షాపులు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుషాపులు, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుషాపులు మొత్తం 8షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సభ్య కార్యదర్శిగా శరత్‌కుమార్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీవోఎస్‌టీ) సభ్య కార్యదర్శిగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.శరత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగవచ్చని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ శరత్‌కుమార్ గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో ఆర్ అండ్ డీ, వీఆర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

21న పెన్షన్ అదాలత్ : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):ఈనెల 21న పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో విధాన గౌతమి మీటింగ్ హాల్‌లో ఉదయం 10గంటలకు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, సమస్యల వివరాలతో హాజరుకావాలన్నారు.

కాకినాడ

నేడు ఉచిత వైద్య శిబిరం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సంజయ్‌నగర్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు జరగనుంది. కంటి, బీసీ, షుగర్, ఇసీజీ, ఎముకలు, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత, సాధారణ పరీక్షలు చేయనున్నారు. అదే విధంగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు.

కేన్సర్ ఆసుపత్రి అంకాలజీ విభాగం ఏర్పాటుకు ప్రదేశాల పరిశీలన

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో నూతనంగా నిర్మించనున్న కేన్సర్ ఆసుపత్రి అంకాలజీ విభాగం ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గురువారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణం పక్కన ఉన్న మున్సిపల్ అతిథి గృహం స్థలాన్ని సందర్శించారు. కాకినాడ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన 500 పడకల నూతన సమీకృత ఆయుర్వేద ఆసుపత్రిని ఆయుష్ వైద్య అధికారులు, ఏపీఎంఎస్ఐడీసీ, జీపీటీ కళాశాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. చివరి దశకు చేరుకున్న సమీకృత ఆయుర్వేద ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు, ఆసుపత్రికి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం, కేన్సర్ ఆసుపత్రికి అనువైన ప్రదేశాలను మ్యాప్‌ల ద్వారా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రత్నరాజు, డీఈ చక్రవర్తి, ఆయుష్ వైద్య అధికారులు డాక్టర్ మహమ్మద్ షాజన్ ఆలీ, శ్రీనివాసు, జీపీటీ ఇన్‌చార్జి సంజయ్ తదితరులున్నారు.



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్

స్వామివారి ఆదాయాన్ని కాపాడండి!

శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామికి చెందిన చెరువులో అనధికారికంగా చేపల సాగు

లక్షలు కొట్టేసేందుకే 3 నెలలకు వేలం పాట

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా చేపల, రొయ్యల చెరువులకు వేలం పాట ఏడాది, రెండేళ్లకు, మూడేళ్లకు నిర్వహిస్తూంటారు. కానీ దేవదాయ, ధర్మదాయశాఖాధికారులు మాత్రం ఎక్కడాలేని రీతిలో 3 నెలల కాలానికి చేపల పెంపకం, పట్టుబడికి వేలం పాట నిర్వహించేందుకు అత్యుత్సాహం ప్రదర్శించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కూడా జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడకు కూతవేటు దూరంలో ఉన్న సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి చెందిన సుమారు 2.50 ఎకరాల చెరువులో చేపలు పెంపకం, పట్టుబడికి వేలం పాటకు రెండుసార్లు ప్రయత్నించడంతో స్థానికులు విస్తుపోయారు. ఈ తరుణంలో 3వ సారి వేలంపాటకు అధికారులు సమాయత్తమవుతున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరిపించి, స్వామి ఆదాయాన్ని కాపాడేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



భావనారాయణస్వామి ఆలయ ఉత్తరంలో ఉన్న చేపల చెరువు

నిబంధనలు పాటించకుండా...

కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి చెందిన సర్వే నెంబర్ 35లో సుమారు 2.5 ఎకరాల చెరువు ఉంది. ఈ చెరువులో చేపల పెంపకానికి గతంలో దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు రెండేళ్ల కాలవ్యవధికి చేపలు పెంచుకుని, పట్టుబడి కోసం ఆ శాఖ కార్యనిర్వాహణాధికారులు గతేడాది మార్చి 2024లో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో స్థానికుడు పుల్ల చక్రధర్ రూ.2.50 లక్షలకు (ఏడాది)కి వేలం పాడి, అడ్వాన్సుగా దేవస్థానానికి రూ.50 వేలు అడ్వాన్సు చెల్లించాడు. చెరువులో చేపల సాగుకి సకాలంలో అధికారులు లీజు ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో తన లీజు రద్దు చేసి తాను కట్టిన అడ్వాన్సు వెనక్కి ఇవ్వాల్సిందిగా కలెక్టర్, దేవదాయశాఖ అధికారులకు అర్జీ పెట్టుకుని, చేపల సాగు నుంచి తప్పుకున్నాడు. నిబంధనల మేరకు వేలం పాట రద్దు చేసి మళ్లీ బహిరంగ వేలం పాట పెట్టి, హెచ్చుపాడుకున్న వారికి వేలం పాట ఖరారు చేయాల్సిన బాధ్యత కార్యనిర్వహణాధికారిపై ఉంది. అయితే నిబంధనలు పాటించకుండా సదరు ఈవో ప్రైవేట్ వ్యక్తులు ఇచ్చిన కాసులకు కక్కుర్తి పడి, పుల్ల చక్రధర్ పేరునే జూన్ 2024లో రూ.1.45 లక్షలను వేరొక వ్యక్తితో కట్టించుకుని నిబంధనలను బేఖాతర్ చేశారు. అనధికారికంగా చేపల సాగు చేస్తున్నా, దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు, ఇన్‌చార్జి ఈవో అదే మీ చేయకుండా రెండోసారి నిబంధనలు పక్కన పెట్టి లీజు ఆర్డర్ ఏమీ లేకుండా అనధికారికంగా చేపల సాగు చేసేలా పరోక్షంగా సహకారం అందిస్తున్నారు. అంతటితో ఆగకుండా అనధికారిక చేపల సాగును సక్రమం చేసేందుకు 3 నెలల కాలానికి చేపలు పెంచుకుని, పట్టుబడి కోసం ప్రకటనలు ఇచ్చి మరీ బహిరంగ వేలం పాటకు తెరలేపారు. 2సార్లు వేలం పాటను స్థానికులు అడ్డుకుని అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాత్కాలికంగా వేలం పాటను వాయిదా వేస్తున్నట్టు ఇన్‌చార్జి ఈవో ప్రకటించారు. లీజు ఆర్డర్ లేకుండా ఈవో ఇష్టానుసారం తనకు నచ్చిన వారితో అనధికారికంగా చేపల సాగు చేయించుకోవడమే కాకుండా, చేపలు పట్టుకోవడానికి అధికారికంగా వేలం పాట ఎలా నిర్వహిస్తారంటే స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెరువులో రూ.లక్షలు విలువ చేసే చేపలను అధికారులే పట్టి అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని స్వామివారికి చెందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్ ప్రకటనలో పేర్కొన్నారు. వాకతిప్ప వాటర్ వర్క్స్, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, రవీంద్రపురం, ఉప్పాడ, సుబ్బంపేట, అమీనబాద్, మూలపేట వాటర్‌వర్క్స్ కొండెవరం, కొత్త, పాత ఇసుకపల్లి గ్రామాలు, యండపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, పొన్నాడ, నాగులాపల్లి చెరువులు, యండపల్లి చెరువులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కుంతీమాధవునికి పంచామృతాభిషేకం

పిఠాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచామాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని కుంతీమాధవస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం విశేషపూజలు జరిగాయి. స్వామి, అమ్మ వార్లకు ఉదయం పంచామృతాభిషేకం, సాయంత్రం కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం స్వామిని పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవ భక్తబృందం పాల్గొన్నారు.



కుంతీమాధవస్వామికి పుష్పాలంకారం

మినుము పంటపై తెల్లదోమ ప్రభావం

డిప్యూటీ డైరెక్టర్ హరి



ఏ.విజయనగరంలో మినుము పంటను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ హరి తదితరులు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మినుము పంటపై తెల్లదోమ ఆశించినట్టు గుర్తించామని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బీవీఎస్ హరి తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏ.విజయనగరం గ్రామంలో జాతీయ ఆహారభద్రతా మిషన్ పథకంలో భాగంగా సాగు చేసిన మినుము పంటను ఆయన గురువారం పరిశీలించారు. తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రైడ్, వేపనూనె, కస్టోడియా మందులను రైతులకు పంపిణీ చేశారు. 50శాతం రాయితీపై పురుగుమందులను అందజేశారు. పంటపొలాలను ప్రతి రోజూ పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, వీఏఏ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద సంబరాలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబుకు పార్లమెంటరీ మంత్రిత్వ శాఖ ద్వారా నాలుగు కమిటీల లో సభ్యులుగా నియమించడం హర్షనీయమని కాకినాడలోని రాజ్యసభ ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద గురువారం నాయకులు మిఠాయిలు పంచి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు సతీష్‌బాబును పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ సలహా కమిటీసభ్యునిగా, సౌత్ సెంట్రల్ జోనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యునిగా, పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సలహా కమిటీ సభ్యునిగా, స్కిల్ డవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రైనర్‌షిప్ మంత్రిత్వ శాఖ హిందీ సలహాకార్ సమితి సభ్యునిగా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ నగర మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి మేకా లక్ష్మణ్‌మూర్తి, ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ నాగిరెడ్డి బుజ్జి, నాయకులు చింతపల్లి అర్జున్, అంకంరెడ్డి రామునాయుడు, బర్ల శ్రీనివాస్, యాళ్ల చక్రవర్తి, వాసంశెట్టి శివశంకర్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ ఉన్నారు.



రాజ్యసభ ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న నాయకులు

వేణుగోపాలస్వామికి విశేష పూజలు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం మహాపర్వదినాలు పురస్కరించుకుని సామర్లకోట విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా వేంచేసిఉన్న రాధా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం జరిగిన విశేష పూజల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని స్వామివారిని దర్శించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన మహాన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'పేరాబత్తులను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం'

కూటమి నాయకుల ప్రచారం



సర్పవరం జంక్షన్: పేరాబత్తులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే నానాజీ, నాయకులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, అంతా సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మీ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం వలసపాకలలో టీడీపీ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన,సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఓటర్లకు వివరించాలని, కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. నియోజకవర్గంలో 14,998 ఓటర్లున్నారని, ఒక్కొక్కరు 30 ఓటర్లను కలుసుకుని వాళ్లతో ఓటు వేయించే బాధ్యత సమష్టిగా తీసుకోవాలన్నారు. ఎంతో కష్టపడి గ్రాడ్యుయేటర్లను ఓటర్లుగా నమోదు చేశామని, వీరిని పోలింగ్ బూత్‌కి తీసుకొచ్చి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా కృషి చేయాలని కోరారు. పలువురు గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలు అందించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), శెట్టిబలిజ,గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మట్టా ప్రకాశ్‌గౌడ్, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, కరెడ్ల గోవిందు, బోళ్ల కృష్ణమోహన్ పాల్గొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలువగట్టులో జనసేన రాష్ట్ర సహాయ కార్యదర్శి తాటికాయల వీరబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మద్దతుగా గ్రాడ్యుయేట్ ఓటర్లతో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని ఓట్లు అభ్యర్థించారు.

ప్రతి ఓటరును కలవాలి

పిఠాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఓటు అభ్యర్థించాలని, ఎన్నికల రోజు వరకూ నిరంతం వారితో టచ్‌లో ఉండాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ సూచించారు. 30మంది ఓటర్లకు ఒక్కరు వంతున ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారకర్తలుగా నియమితులైన వారికి పిఠాపురం టీడీపీ కార్యాలయంలో గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ పట్టబద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలన్నారు. కూటమి అభ్యర్థికి ప్రథమ ప్రాధాన్యత ఓటును ఎలా వేయాలనే అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. నేతలు, కార్యకర్తలున్నారు.



పిఠాపురంలో మాట్లాడుతున్న పీలా గోవిందు సత్యనారాయణ

పెద్దాపురంలో...

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం సచివాలయాల్లో, పలు ప్రధాన కూడలి ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ప్రచారంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీ సాధించి పెట్టాలని కోరారు. కూటమి పాలనలో గడిచిన 6నెలలుగా ప్రభుత్వం సాధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తూతిక రాజు, యాళ్ళ వీరబాబు, మహ్మద్ అరిఫ్ ఆలీ, పొలమరశెట్టి సత్తిబాబు, లక్ష్మణ్‌దివాకర్, వంగలపూడి సతీష్, రవి, దుర్గామోహనరావు, పి.రామ్‌కుమార్, అనివిలా శాస్త్రి, ఎన్. రామారావు, బొడ్డు ఉదయ్, విరోదుల రాజు, కటారి శ్రీను పాల్గొన్నారు. పెద్దాపురం మండలం రాయభూపాల పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొని పలువురు ఉపాధ్యాయులను కలిసి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని పలువురు ఉపాధ్యాయులను కోరారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎనిమిది మంది వాహనదారులకు జరిమానా

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా 8 మంది వాహనదారులు మద్యం తాగి బైక్‌లు నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వారిని 3వ జ్యుడిషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా 8మందికి తలో రూ.10 వేలు వంతున రూ.80 వేలు జరిమానా విధిస్తూ జడ్జి జి.శ్రీదేవి తీర్పు ఇచ్చినట్టు సీఐ పేర్కొన్నారు.

'విద్యాభివృద్ధికి కృషి'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ ఎంతో కృషి చేస్తున్నదని ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి మల్లాడి ఆకాష్‌కి రూ.1,00,000 చెక్‌ను గురువారం పూర్వ విద్యార్థులు అందజేశారు. గత 4 ఏళ్ల నుంచి వైద్య విద్యార్థికి ఏటా సహాయం చేస్తున్నామని బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎన్.కళ్యాణి, కోశాధికారి జగన్నాధరావు, మధు, శారద, ప్రసాద్ ఉన్నారు.



పేద వైద్య విద్యార్థికి స్కాలర్‌షిప్ చెక్‌ను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం



డ్రైవర్లకు మెటీరియల్ అందజేస్తున్న అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలో గురువారం 19వ హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి డిపో మేనేజర్ మనోహర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొని శిక్షణ తీసుకునే డ్రైవర్లకు మెటీరియల్ బుక్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ కాలంలో డ్రైవర్లు క్రమ శిక్షణతో ట్రైనింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రమాదాలను నిలువరించడంతో డ్రైవర్లే ముఖ్య పాత్ర పోషించాల్సిన అవసరముందన్నారు. శిక్షణలో నిబద్ధతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గత నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో జరుగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా కాకినాడ ఆర్టీసీ డిపోలో గురువారం రక్తదాన శిబిరం వహించారు. కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో రోటరీ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో 68మంది రక్తదానం చేశారు. శ్రీనివాసరావు కూడా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, తుని డిపో మేనేజర్ ఎం.కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజ్ ఎస్‌కెఎం బాషా, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రొట్టెలు, పండ్లు పంపిణీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జగపతిబాబు 63వ జన్మదినోత్సవం సందర్భంగా కాకినాడ ఆనంద నిలయంలో 120మంది బాలురకు రొట్టెలు, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. భోజనాలు పెట్టారు. పైడా కృష్ణమోహన్, మల్లిపూడి వీరు, నున్న శివ, జగపతిబాబు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వైదాడి శివ, వైదాడి స్వామి, వైదాడి గణేష్, గబ్బర్, స్వరూప్, అక్షయ్, అప్పసాని రామకృష్ణ, వై.జయ, అడదాడి శ్రీనివాస్, రామస్వామి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్పయాగోత్సవం



పూజల్లో ఉత్సవమూర్తులు

సామర్లకోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా సామర్లకోట మండలం వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి,అమ్మవార్లకు గురువారం రాత్రి శ్రీపుష్పయాగోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేక వేదికపై అలంకరించి శ్రీమాన్ ఆడపల్లి గోపాలాచార్యులు తదితర పండితులు విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయంలో వివిధ పూలతో అలంకరించిన పూలపానుపుపై ఉంచి 109 రకాల పిండివంటలతో నైవేద్యాలను అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పండిత సత్కారం చేశారు. పూజల్లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నున్న రామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు, పారిశ్రామికవేత్తలు నున్న నారాయణ రావు, గుమ్మళ్ళ సత్యనారాయణ, గుమ్మళ్ళ రాయన్న, గోలి రవిబాబు, గోలి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీఎల్ఏ సహాయ కమిషనర్ పరిశీలన

సామర్లకోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల పరిధిలో రెవెన్యూ సమస్యలపై అధికారులు తీసుకున్న చర్యలు, అర్జీదారుల సమస్యలు తదితర అంశాలపై సీసీఎల్ఏ సహాయ కమిషనర్ డి.రమాదేవి గురువారం సాయంత్రం పరిశీలించారు. సామర్లకోట మండలం వేట్లపాలెంలో పైలట్ ప్రాజెక్ట్‌గా రీసర్వే పనులు జరుగుచున్న విషయం విదితమే. అలాగే మండల తహశీల్దార్ కార్యాలయంలో వివిధ భూసమస్యలకు చెందిన సమస్యల పరిష్కారం ఎంతమేర చేశారు, ఇంకా పెండింగ్ ఎన్ని ఉన్నాయి, పెండింగ్‌కు గల కారణాలపై సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్(సర్వే) వై.శ్రీనివాసు, కార్యాలయ సూపరింటెండెంట్ పద్మజలతో సమీక్షించారు.

క్రమశిక్షణతో కష్టపడి విద్యనభ్యసించాలి

ట్రైనీ ఏఎస్పీ సుస్మిత

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి విద్యనభ్యసించినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని ట్రైనీ ఏఎస్పీ ఆర్.సుస్మిత అన్నారు. గురువారం పండూరు హైస్కూల్‌ని ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని అవగాహన చేసుకోవాలన్నారు. బాల,బాలికలు చక్కగా కటింగ్, జడలు వేసుకుని ఇన్‌షర్ట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బావిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.రామ్మోహన్‌చౌదరి, పాఠశాల హెచ్ఎం.సూర్యప్రకాశిని తదితరులున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ ఏఎస్పీ సుస్మిత

'కాలుష్యం నుంచి రక్షించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలంలో కాకినాడ గేట్‌వే ఫోర్ట్, దివిస్ ఫార్మా, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి కాలుష్యం విడుదల కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాను కోరారు. టీడీపీ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో రైతులు గురువారం జిల్లా జాయింట్‌కలెక్టర్ రాహుల్ మీనాను కాకినాడలో కలిశారు. కంపెనీలకు భూములు ఇవ్వడం వల్ల తమ ఉపాధి కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీల నుంచి విడుదల అవుతున్న విషవాయువుల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని జేసీ రాహుల్‌మీనా హామీ ఇచ్చారు.



జేసీ రాహుల్‌మీనాకు సమస్యలు వివరిస్తున్న యనమల రాజేష్, రైతులు

'వైసీపీ కబ్జా నుంచి ఇంటి స్థలాన్ని కాపాడండి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన వైసీపీ నాయకుల కబ్జా నుంచి కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ హిందూ శ్మశాన వాటిక రోడ్‌లోని తన ఇంటి స్థలాన్ని కాపాడాలని ఆ ప్రాంతానికి చెందిన దళిత మహిళ మందపల్లి దుర్గ జిల్లా కలెక్టర్‌కు మొర పెట్టుకుంది. ఈ మేరకు గురువారం దళిత నేతల సహకారంతో మందపల్లి దుర్గ ఆమె కుటుంబ సభ్యులు మందపల్లి హరి, మందపల్లి శ్రీదేవి కలెక్టర్, ఇతర అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సుమారు 60 ఏళ్లగా తమ పెద్దల నుంచి ఈ ప్రాంతంలో నివసిస్తుండగా 2009లో వైఎస్ఆర్ బ్రిడ్జి భూ సేకరణ సమయంలో స్థలాలు కోల్పోయిన తమకు శ్మశానభూమి, మరుగుదొడ్డి భూమిలో పొజిషన్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. తనకు ఇళ్లు కట్టుకునే స్థోమత లేక షెడ్డు వేసుకుని నివాసం ఉంటున్నానని ఆమె తెలిపింది. తన స్థలంపై గత ప్రభుత్వంలో కన్ను వేసిన వైసీపీ నాయకులు సర్వే నంబర్ మార్చి తప్పుడు సర్వే రిపోర్టులతో కబ్జా చేశారని, అయినా తాను అదే స్థలంలో నివాసం ఉండటంతో రౌడీలను తీసుకొచ్చి దౌర్జన్యం చేయిస్తున్నారన్నారు. వైసీపీ వాళ్ల వేధింపులు తట్టుకోలేక తన పెద్ద కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తన పొజిషన్ పట్టాలోని సర్వే నంబర్, తాను నివాసం ఉంటున్న స్థలం సర్వే నంబర్ సరిపోయిందని ఆర్డీవో, ఎమ్మార్వోలు రిపోర్ట్ ఇచ్చారని అయినా వేరే సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించిన దస్తావేజులతో తన స్థలం కాజేయాలని చూస్తున్నారన్నారు. మగ దిక్కు లేక, నిలువడానికి నీడలేక, ఎక్కడికి పోవాలో తెలియక కుటుంబం మొత్తం చనిపోయే పరిస్థితిలో ఉన్నామన్నారు. వారిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకుని తన స్థలాన్ని కాపాడి న్యాయం చేయాలని కోరింది.

పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతా

గండేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎన్టీరాజాపురం, సింగరంపాలెం కార్యదర్శి బేరి వెంకట సత్యరామనాధ్ అన్నారు. ఆయన గురువారం ఎన్టీరాజాపురం గ్రామంలో చర్యలు చేపట్టి సిబ్బందితో చెత్త పోగులు లేకుండా శుభ్రం చేయించారు. దోమల నివారణలో భాగంగా డ్రైనేజీల్లో పూడిక తీయించి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



గోదారిలో సూర్య ప్రతి'బింబం'

ఎటపాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాస్తమయం సమయంలో సూర్యకిరణాల ప్రతిబింబం గోదావరిలో ఎర్రటి గీత గీసినట్టుగా కన్పించింది. గురువారం మురుమూరు- పోలిపాక మధ్య గోదావరి రేవులో ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి'కి చిక్కింది. దీనిని కొందరు ఆసక్తిగా వీక్షించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

మోతుగూడెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా మోతుగూడెంలో గురువారం చింతూరు మండల నాయకుడు ఇల్లా చిన్నారెడ్డి, కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. టీడీపీ చింతూరు, మోతుగూడెం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మోతుగూడెంలో ఓటు అభ్యర్థిస్తున్న టీడీపీ నాయకులు

పూర్వ విద్యార్థి ఔదార్యం: వలంటీర్లకు గౌరవ వేతనం అందజేత

మోతుగూడెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో బోధనా సిబ్బంది తక్కువగా వున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన పిల్లల చదువుకు ఇబ్బంది కలగకుండా ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఈ ఏడాది జూన్ నుంచి విద్యా వలంటీర్లను నియమించి వారికి సొంతంగా ప్రతినెలా రూ.19వేలు వేతనాలుగా అందిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో పూర్వపు విద్యార్థి, కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో నివాసం ఉంటున్న విజయమోహన్ సాంబశివన్ ఈ నెల విద్యా వలంటీర్లకు అయ్యే గౌరవ వేతనం రూ.19వేలు అందజేశారు. ఈ సొమ్మును ఎంపీటీసీ కరకా వెంకటరమణ చేతులమీదుగా అందజేశారు. హెచ్ఎం ప్రవీణ్ మాట్లాడుతూ ఇంతటి బాధ్యత గల ప్రజాప్రతినిధులు ఈ గ్రామంలో ఉండడం గిరిజన పిల్లల అదృష్టమన్నారు. కార్యక్రమంలో రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యా వలంటీర్లకు వేతనాలు అందజేస్తున్న దృశ్యం

'జీవో నెం.3ని పునరుద్ధరించాలి'

రంపచోడవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెం.3 పునరుద్ధరణ అంశాన్ని వచ్చే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడతామని, మన్యం బంద్ సందర్భంగా కూటమి ప్రభుత్వం రాత పూర్వకంగా అఖిలపక్షాలకు, ఆదివాసీ జేఏసీలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సమక్షంలో చేసుకున్న ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. గురువారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రమణ అధ్యక్షతన జరిగిన ఏఐకేఎంఎస్, పీవోడబ్ల్యు, ఆదివాసీ ప్రజా సంఘాల డివిజన్ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్యం బంద్ నిర్వహణ కమిటీ, ఆదివాసీ మహా పంచాయితీలో రాతపూర్వకంగా తీసుకున్న డిక్లరేషన్ ప్రకటన సంపూర్ణంగా అన్ని ఐటీడీఏల పరిధిలో అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో అసెంబ్లీలో నిరసన, ఆందోళన, దశలవారీ వారీ కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు కె.బాలురెడ్డి, పి.లచ్చిరెడ్డి, మడి ప్రసాద్‌దొర, మడకం జోగమ్మ, సరస్వతి, చిలకమ్మ, లచ్చన్నదొర, ఆదిరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలని వినతి

కూనవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కోతుల వల్ల తాము బడికి వెళ్లలేకపోతున్నామని కూనవరం విజయసాధన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కూనవరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ప్రతిరోజూ ఉదయం పాఠశాల గోడలపై కోతులు ఉంటున్నాయని, అవి కొంత మంది విద్యార్థులపై పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. ఈ కారణంగా బడికి వెళ్లలేకపోతున్నామన్నారు. ఒక్కోసారి తరగతి గదుల్లోకి వచ్చి పాఠ్యపుస్తకాలు చింపివేస్తున్నాయన్నారు. తక్షణం కోతుల బెడద నుంచి కాపాడాలని కోరారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు, విద్యార్థులు

'గిరిజన జాతికి స్పీకర్ క్షమాపణ చెప్పాలి'

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టాన్ని ఎత్తివేయాలని ప్రపోజల్ పెట్టిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజన జాతికి తక్షణం క్షమాపణ చెప్పాలని సీపీఐ (ఎంఎల్) వినోద్‌మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం నాయకత్వంలో బొర్నగూడెంలో గురువారం నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజనులు స్పీకర్‌కు చులకనగా కనిపించారా అని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజనుల చట్టాలు, మన్యం సంపద జోలికొస్తే క్షమించమని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం రంపచోడవరం డివిజన్ నాయకులు నాగులాపల్లి అర్జునుడు, సోమల కుశల, రెడ్డి రాజారెడ్డి, గర్రెం వీరలక్ష్మి, బూడిద అచ్యుతం, కోసూరి కుమారి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులుకు మద్దతుగా ప్రచారం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తూ హక్కులు, డిమాండ్ల సాధనకు మండలిలో తమ గొంతు వినిపిస్తున్న పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర్రాఘవులు విజయం కోరుతూ గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ప్రజా సంఘాల నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, పెయ్యల పాపారావు, కె.ప్రవీణ్, కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న దృశ్యం

బాధితుడికి టీడీపీ నాయకుల సాయం

కూనవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాచవరం పంచాయతీ మాజీ సర్పంచ్ భర్త బాలయోగి కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు టీడీపీ కూనవరం మండల నాయకులు రూ.5వేలు సాయం అందించారు. టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు ముల్లూరు గ్రామానికి చెందిన తుంగల బ్రదర్స్ ఈ సహాయం అందించారు.

రైతులు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షం

• టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

తుని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తుని పట్టణ శివారు కుమ్మరిలోవ కాలనీలో పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో 47 ఎకరాల భూమిని కోల్పోయిన పలువురు రైతులు పక్షాన యనమల నిలబడి వారికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్చలు జరిపి రైతులకు న్యాయం చేయడంతో కుమర్ల గ్రామానికి చెందిన రైతులు తేటగుంట టీడీపీ కార్యాలయానికి చేరుకుని యనమలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ టీడీపీ నాయకులు జక్కన్న రామ్‌నాయుడు సారధ్యం లో రైతులు యనమలను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ పోలవరం పనుల అనంతరం రైతులకు అప్పగించేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని, రైతుల పొలాల్లో పోలవరం మట్టిని డంప్ చేస్తున్నందుకుగాను ఈ ప్రాంత రైతాంగానికి ఆమోదయోగ్యమైన ఫలాన్ని ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతల రాంబాబు, గేదెల రామకృష్ణమూర్తి, తొత్తిడి రాంబాబు, జక్కాన రామచంద్రరావు, భోగం జమీలు,జక్కాన రంగారావు, గోవిందు, అప్పల నాయుడు, జక్కాన లోవలు, నూకరాజు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



యనమలను సత్కరిస్తున్న కుమ్మరిలోవ రైతులు

తాగునీటి వృథాను అరికట్టండి

రౌతులపూడి, ఫిబ్రవరి 13: రౌతులపూడి బీసీ కాలనీలో తాగునీరు వృథాగా పోతుంది. పబ్లిక్ కుళాయికి హెడ్‌లేక పోవ డంతో రెండు నెలలుగా తాగునీరు వృథాగా పోతుందని కాల నివాసులు తెలుపుతున్నారు. ప్రజలు తాగునీటి అవసరాలు కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో పంచాయతీ వాళ్లు కుళాయిలు వదులుతున్నారు. ఆ సమయంలో తాగునీరు వృథాగా పోతుంది. వేసవి కావడంతో భవిష్యత్‌లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కుళాయి వద్ద వృథాగా పోతున్న నీరు

ముస్లిం శ్మశానవాటికలో అక్రమ మట్టి తవ్వకాలు

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలను తెలుగుదేశం పార్టీశ్రేణులు యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తుండగా తాజాగా ముస్లిం శ్మశానవాటికలో తవ్వకాలు జరిపించడం చర్చనీయాంశమే కాకుండా రాజకీయరంగు పులుముకుంది. వివరాల్లోకి వెళితే గ్రామంలో పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుండగా వాటి పునాదులు పూడ్చేందుకు మట్టి అవసరం కాగా, దానిని కప్పేందుకు ముస్లింల శ్మశానవాటికలో మట్టిని వినియోగించారు. దీంతో ముస్లిం మతపెద్దలు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా ఎస్.ఐ హరిబాబు ముస్లిం మతపెద్దలు, అక్రమ మట్టితవ్వకాలు చేపట్టిన ఎక్స్‌కవేటర్ యజమాని సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఈవిషయం తమకు తెలియదని టీడీపీ శ్రేణులు తవ్వమంటే తాము పూడ్చామని వారు బదులిచ్చారు. మరోపక్క దీనికి ముస్లిం మతపెద్దలు ఆ ప్రదేశంలో పూడ్చిపెట్టిన కళేబరాలను ఎస్‌ఐకు చూపడంతో అవాక్కయ్యారు. ఇది మతపరమైన సమస్య కావడంతో ముస్లిం పెద్దల సమక్షంలో టీడీపీ శ్రేణులు, ఎక్స్‌కవేటర్ యజమానితో చర్చలు జరిపి ఇకపై ఎటువంటి తవ్వకాలు చేపట్టవద్దని దివంగతులైన వారి కళేబరాలను సంప్రదాయబద్ధంగా ఖననం చేసేవిధంగా ఆదేశించారు. దీనిపై ఎటువంటి కేసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదని ఎస్.ఐ హరిబాబు తెలిపారు.



ముస్లిం మతపెద్దలతో చర్చిస్తున్న ఎస్.ఐ హరిబాబు

భూ కబ్జాదారులపై కేసు నమోదు చేయాలి

• రైతు కూలీసంఘం నాయకుడు కర్నాకుల

జగ్గంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా తాండ్రపాడు గ్రామంలో ప్రభుత్వ భూములలో గుడిసెలు నిర్మించుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజలపై దాడిచేసి వారి గుడిసెలను తగులపెట్టిన భూ కబ్జాదారుల నిరంకుశత్వాన్ని ఖండిస్తూ నిరాశ్రయులైన పేదలను అన్నివిధాలా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట రంగవల్లినగర్‌లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. భూ కబ్జాదారుల నిరంకుశత్వాన్ని ఖండిస్తూ నిరాశ్రయులను ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో నేటికీ ఉండడానికి ఇల్లు లేక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా గుడిసెలు తగలపెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భూ కబ్జాదారుల రౌడీలపై ప్రతిఘటించే క్రమంలో పలువురు మహిళలకు గాయాలయ్యాయన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సంఘటనపై విచారణ జరిపి దళితపేదలపై దాడులు చేసిన భూ కబ్జాదారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిరాశ్రయులైన పేదలను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, నాయకులు కె. రామలింగేశ్వరరావు, డి. సురేష్, జాన్, సోమరాజు, లక్ష్మి పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

మైక్రో ఫైనాన్స్ రుణాలపై అప్రమత్తంగా ఉండాలి

• యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు మైక్రో ఫైనాన్స్ రుణాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ శ్రీనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాలు మహిళలు, వీవోఏలు గురువారం జరిగిన సమావేశానికి ఏపీఎం వై.వెంకట్ అధ్యక్షత వహించారు. డిప్యూటీ రీజనల్ హెడ్ శ్రీనారాయణ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు ఓటీపీ, ఏటీఎం పిన్ నెంబర్ తెలపరాదని, అలాగే తెలియని వాట్సాప్ లింకుల ద్వారా రెస్పాండ్ కాకూడదని తెలిపారు. ఈ విషయాన్ని డ్వాక్రా సంఘాలు సభ్యుల క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో ప్రత్తిపాడు, ధర్మవరం యూబీఐల మేనేజర్ సుజల్, చందనకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ లతాచార్యులు, పీసీలు వై.శ్రీను, అకౌంటెంట్ నాగేశ్వరరావు, ఈవోఏలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలకు తూట్లు

తుని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని అంబేద్కర్ ఇండియన్ మిషన్ జోనల్ ఇన్‌చార్జ్ కొల్లాబత్తుల దిలీప్‌కుమార్ విమర్శించారు. తుని సిద్దార్థ ఫంక్షన్ హాల్లో అంబేద్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడే జల్లు చినబాబు అధ్యక్షతన జరిగిన దళిత జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిసిన ఐపీఎస్ అధికారి అంబేద్కర్ ఆశయాల సాధకుడు డీజీ పీవీ సునీల్ కుమార్‌పై రఘురామకృష్ణంరాజు కనుసన్నల్లో కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. జై భీమ్ మాలమహానాడు అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్, సర్పంచ్ జగటాల వీరబాబు, సన్నీ, గుణపర్తి అపురూప్, సాక సత్తిబాబు, నత్తల త్రిమూర్తులు, భాను, పలకా శ్రీనివాస్, జోషి పాల్గొన్నారు.

శివకేశవుల ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

జగ్గంపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరునదీ తీరాన ఉన్న శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి శివకేశవులు క్షేత్రంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు, తోట సర్వారాయుడు సునీత దంపతులచే గురువారం నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న శివకేశవుల ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మొదటిరోజు వెంకటేశ్వరస్వామికి శ్రీ వైకానస భగవత్‌శాస్త్ర ప్రకారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అకల్మషహోమం, నవగ్రహారాధన, యాగశాల వాస్తు శుద్ధి, ఆచార్యాద్ది రుద్విక్ వరుణదీక్షా ధారణ, అంకురార్పణ, యాగశాల ప్రదేశంలో జరిగాయి. ఈనెల 17న శివకేశవుల ప్రతిష్ఠామహోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతిభావంతులకు దివిస్ ఉపకార వేతనాలు

తొండంగి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో గత సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం దివిస్ సంస్థ ఉపకార వేతనాలను పంపిణీ చేసింది. దానవాయిపేట ఉన్నత పాఠశాలలో చదివిన ఒంటిమామిడి, దానవాయిపేట పంచాయతీలకు చెంది అత్య ధిక మార్కులు సాధించిన మైలపల్లి భవాని, మడికి మహాలక్ష్మి, బ్రహ్మదేవు లక్ష్మి, కొమ్మోజు శశికిరణ్, అర్జిల్లి దివ్యలకు దివి స్ సంస్థ జనరల్ మేనేజర్ నాగేశ్వర్ 70వేల విలువైన ఉప కార వేతనాలను అందించారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బి.వాసుబాబు, ఎన్.బాలకృష్ణ, తేజ పాల్గొన్నారు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న దివిస్ జనరల్ మేనేజర్

ఏలేశ్వరంలో అన్నదానం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏలేరు ప్రాజెక్టు వద్ద శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంవద్ద అన్నదానం నిర్వహించారు. మాఘమాసం గురువారం పురష్కరించుకొని పురోహితులు సాయి నేతృత్వంలో బంకరాజు, సుజాత దంపతులచే బాబాకి ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబాను దర్శించుకొని అన్నప్రసాదం స్వీకరించారు. పండు, దత్తి రాజు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగయ్యపురం గ్రామానికి చెందిన దశరథ శ్రీరాములు ఇటీవల మరణించారు. వారి కుటుంబాన్ని జనసేనపార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రమేష్ వెంట మరిసే రామకృష్ణ, దుర్గాప్రసాద్, కొట్టేడి నాగేశ్వరరావు, మరిసే శ్రీను, దశరథ అరుణ్, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను,గోకేడ ప్రసాద్, గోకేడ రమణ తదితరులు జనసైనికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు 33/11కే వీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జగ్గంపేట విద్యుత్‌ఏఈ వీరభద్రరావు గురువారం తెలిపారు. మండలంలోని ధర్మవరం, టి.రాయవరం, ఏలూరు, ఒమ్మంగి, పొదురుపాక, పాండవులపాలెం, బౌరువాక, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, శాంతి ఆశ్రమం, యుజేపురం, వాకపల్లి,పోతులూరు, ఉత్తరకంచి, పెద్దిపాలెం, వేములపాలెం, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, గోకవరం, వంతాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోటనందూరు: కేఈ చిన్నాయి పాలెం 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఎల్‌డీపేట ఫీడర్ లైన్‌పై చెట్టుకొమ్మలు నరకటం వలన విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ బి.వీరబద్రరావు తెలిపారు. తిమ్మరాజు పేట, కేఎస్. కొత్తూరు, కే. కోట్టాం, ఎల్‌డీ. పేట, పాతకొట్టాం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ప్రగతిలో వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో వెబ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ విత్ డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై ఈనెల 15వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అకాడమీ నుంచి నారాయణ హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరి జ్ఞానంతో తమను తాము మెరుగుపరుచుకుంటున్నారన్నారు. కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవీ హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రి న్సిపాల్ డాక్టర్ జి.నరేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

శంఖవరం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి ఎరువులు దుకాణంలో ఎరువులు అమ్మకాలు నిలిపివేసినట్టు మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ తెలిపారు. గురువారం భక్తాంజనేయ ఎరువులు దుకాణంలో వ్యవసాయ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టరులో స్టాక్ నిల్వలలో తేడా ఉన్నందున 14.52 టన్నులు తేడాను గుర్తించారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ సంబంధిత ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అధిక ధరలకు ఎరువుల అమ్మకాలు సాగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈయన వెంట ఏఈవో మౌళి, ప్రభాస్ పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలి

గండేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా రికార్డులు సక్రమంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అమరావతి నుంచి డి.రమావతి అన్నా రు. ఆమె గురువారం గండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మికంగా రికార్డులు తనిఖీలు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను పరిశీలించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలకు వచ్చిన సమస్యలు పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్జీలు ఇచ్చిన వారికి ఫోన్‌చేసి సమస్యల పరిష్కారంపై అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూపరంగా ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఆర్.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

గండేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించిందని గండేపల్లి వ్యవసాయ అధికారి ఎ.గురుమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమిగల ప్రతీ రైతుకు కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రతీ రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు.

స్వామి వారి కల్యాణోత్సవం

కిర్లంపూడి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కళ్యాణ మహోత్సవం సరికొండ నూకరాజు, నాగరత్నం, సరికొండ స్వామి లక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. కిర్లంపూడి మండలం విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు గానుగుల శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు చలపాక శివప్రసాద్, మెంబర్ గోరోజు సత్యంబ్రహ్మం, అరటికట్ల శ్రీనివాస్, శివరామకృష్ణ, లావేటి పాపచార్యులు, నాగాచార్యులు ఉన్నారు.